పెండింగ్ పనులన్నింటినీ పూర్తి చేయాలి

వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, మార్చి 19 : ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్యను పెంచి 100 శాతం పనులు రెండు రోజుల్లో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులకు సీసీ రోడ్లు, లేబర్ మొబిలైజేషన్‌కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పనులన్నీ పూర్తి చేయాలని, గ్రామాల్లో ఏయే పనులు అవసరమో వాటినే చేయాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామాల్లో ముండ్ల పొదలు క్లియర్ చేయడం, రోడ్లకు సంబంధించి భూమి చదును చేయడం వంటి తదితర పనులన్నింటినీ రెండు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. పూర్తయిన వాటికి ఎఫ్‌టీవో జనరేట్ చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామ పరిధిలో పంచాయతీ సెక్రెటరీలను ఇన్వాల్వ్ చేసి గ్రామానికి ఉపయోగపడే పనులు చేయాలన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ వ్యవస్థను బలోపేతం చేస్తూ.. కూలీల సంఖ్యను పెంచుతూ 100 శాతం పనును పూర్తి చేయించాలని సూచించారు. గ్రామాల్లో జాబ్ కార్డు ఉన్నవారందరికీ పని కల్పిస్తూ ముందుకు వెళ్లాలని ఆదేశించారు. అనుకున్న అంచనా ప్రకారం కూలీల సంఖ్యను పెంచుకోవాలన్నారు. గ్రామాల పరిధిలో ఉండే చిన్న చిన్న సమస్యలను మండల అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఇప్పటివరకు పూర్తయిన వాటికి ఎఫ్‌టీవో తప్పనిసరిగా జనరేట్ చేయాలని, ప్రణాళిక ప్రకారం ఆయా మండలాల్లో ఎఫ్‌టీవో జనరేట్ అయ్యేలో మండలాల టీఏలకు మార్గనిర్దేశం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశాంచారు. టెలీ కాన్ఫరెన్స్‌లో డీఆర్‌డీఏ శ్రీనివాసులు, జిల్లా పంచాయతీ అధికారి సుధారాణి పాల్గొన్నారు.

అటవీ శాఖ అధికారికి నెమలి అప్పగింత

మొయినాబాద్, మార్చి19 : మండు టెండలకు అలసిపోయి ఎగురలేని స్థితిలో ఉన్న నెమలిని గ్రామస్తులు అటవీ శాఖ అధికారికి అప్పగించారు. మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి గ్రామ శివారులో వ్యవసాయ పొలంలో మంగళవారం ఉదయం గ్రామానికి చెందిన హన్మంత్‌రెడ్డి పొలం వద్దకు వెళ్లాడు. పొలంలో ఓ నెమలి ఎగురలేని స్థితిలో కనిపించడంతో పాత్రికేయుడు యాదయ్యకు హన్మంత్‌రెడ్డి సమాచారం అందించాడు. వారు నెమలిని చిలుకూరు రెవెన్యూ పరిధిలో ఉన్న జాతీయ మృగవని నేషనల్ పార్కులోని అటవీశాఖ సెక్షన్ అధికారి సయ్యద్ కమాలొద్దీన్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా సెక్షన్ అధికారి మాట్లాడుతూ.. వన్య ప్రాణులను కాపాడటానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. నెమలిని తీసుకొచ్చి అప్పగించడం అభినందనీయమని పేర్కొన్నారు.

ముమ్మరంగా తనిఖీలు

- రూ.16.43 లక్షల నగదు సీజ్
- జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్

వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

సిటీబ్యూరో, మార్చి 19 (నమస్తే తెలంగాణ) : ఎన్నికల ప్రవర్తనా నియమావళిలో భాగంగా ఎన్‌ఫోర్స్ టీమ్‌లు మంగళవారం రూ.16.43 లక్షల నగదుతో పాటు రూ.10,250ల విలువ గల ఇతర వస్తువులను సీజ్ చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన వెంటనే పోలీస్, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ టీమ్‌లు క్షేత్రస్థాయిలో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 9 బృందాలు 24 గంటల పాటు పనిచేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఇప్పటివరకు రూ.17, 25, 311 విలువగల వస్తువులను పట్టుకున్నట్లు చెప్పారు. 54.67 లీటర్ల అక్రమ మద్యాన్ని పట్టుకోగా 8 మందిపై ప్రొహిబిషన్ కేసులు నమోదు చేయడమే కాకుండా వారిని అరెస్ట్ చేసినట్లు చెప్పారు. రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు రోనాల్డ్‌రోస్ పేర్కొన్నారు.

సెక్టోరల్ అధికారులదే కీలక పాత్ర

- రంగారెడ్డి కలెక్టర్ శశాంక
- పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్‌లో సెక్టోరల్ అధికారులకు శిక్షణా తరగతులు

రంగారెడ్డి, మార్చి 19 (నమస్తే తెలంగాణ) : ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారులదే కీలకపాత్ర అని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక అన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎన్నికల సెక్టోరల్ అధికారులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. వారు చేపట్టాల్సిన విధులు, పరిశీలించాల్సిన విషయాలపై అంశాల వారీగా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి నిర్వర్తించాల్సిన విధుల గురించి తెలియజేస్తూ రూపొందించిన హ్యాండ్‌బుక్‌ను అందజేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పోలింగ్ కేంద్రాల పరిధిలోని పరిస్థితులను ముందుగానే గమనిస్తూ, ఎప్పటికప్పుడు ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలన్నారు. ఎవరైనా అలసత్వాన్ని ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. పోలింగ్ రోజున ఓటింగ్ శాతాన్ని ఎప్పటికప్పుడు ఎన్ కోర్ యాప్‌లో ఎంట్రీ చేయాలన్నారు. గత ఎన్నికల్లో చోటుచేసుకున్న ఘటనలు, వివిధ అంశాల ప్రాతిపదికన సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి పూర్తి వివరాలతో ప్రాథమిక నివేదికను సహాయ రిటర్నింగ్ అధికారులకు సమర్పించాలని ఆదేశించారు. ఇందులో జిల్లా ఉప ఎన్నికల అధికారిణి ప్రతిమాసింగ్, ఎన్నికల శిక్షణ నోడల్ అధికారిణి సం గీత, ఎంసీసీ నోడల్ అధికారిణి సౌమ్య, ఎన్నికల వ్యయం నోడల్ అధికారి సురేశ్‌మోహన్, ఏఆర్‌ఈవోలు, సెక్టోరల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ఎన్నికల విధులను నిష్పక్షపాతంగా నిర్వర్తించాలి

లోక్‌సభ ఎన్నికల విధులను నిష్పక్షపాతంగా నిర్వర్తించాలని కలెక్టర్ శశాంక అన్నారు. మంగళవారం ఆయన స్టాటిక్ సర్వేలైన్స్, ఫ్లయింగ్‌స్క్వాడ్ తదితర నిఘా బృందాల అధికారులకు కలెక్టరేట్‌లో శిక్షణా తరగతులు నిర్వహించారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ప్రచార సరళి పరిశీలన, ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే చర్యలను నిరోధించడం, ఫిర్యాదులపై తక్షణమే స్పందించడం, నిరంతర తనిఖీలు తదితర అంశాలపై దిశానిర్దేశం చేశారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో మూడు బృందాలను ఏర్పాటు చేసి ప్రతి బృందం ఎనిమిది గంట లపాటు విధులు నిర్వర్తించేలా డ్యూటీలు కేటాయించడం జరిగిందన్నారు. అన్ని పార్టీలు, అభ్యర్థుల పట్ల నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేలా నగదు, మద్యం, ఇతర వస్తువుల పంపిణీపై ప్రత్యేక దృష్టి సారించాలని.. ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించి క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా వాస్తవాలను నిర్ధారించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. స్టాటిక్ సర్వేలైన్స్, ఫ్లయింగ్ స్క్వాడ్ తదితర బృందాలకు సమకూర్చిన వాహనాలకు అత్యాధునిక సాంకేతికతతో కూడిన వీడియో కెమెరాలను ఏర్పాటు చేయిస్తున్నట్లు తెలిపారు. నిఘా బృందాల పనితీరును కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షిస్తామన్నారు. రూ.50 వేల నుంచి రూ.10 లక్షల మధ్య డబ్బుల లావాదేవీలు జరిగితే కచ్చితంగా రసీదుండాలని, రూ.10లక్షలపైన లావాదేవీలుంటే ఆదాయపన్ను శాఖ పరిధిలోకి వెళ్తుందన్నారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులు, ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ, వీఎస్‌టీ టీంలు, అధికారులు పాల్గొన్నారు.

సెక్టోరల్ అధికారులకు శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

జిల్లాలో 3,455 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

జిల్లాలో సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ శశాంక పేర్కొన్నారు. షెడ్యూల్ విడుదలైన నాటి నుంచే జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందన్నారు. ఏప్రిల్ 18న నోటిఫికేషన్ వచ్చి ఏప్రిల్ 25వరకు నామినేషన్లను స్వీకరిస్తారన్నారు. 26న స్క్రూట్నీ ప్రక్రియ, నామినేషన్ల ఉపసంహరణకు ఏప్రిల్ 29 వరకు గడువు ఉంటుందన్నారు. మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ ఉంటుందన్నారు. జిల్లా పరిధిలో చేవెళ్ల, భువనగిరి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గాలు ఉన్నాయని.. చేవెళ్ల ఎంపీ పార్లమెంట్ పరిధిలో నామినేషన్ల కోసం రాజేంద్రనగర్‌లో రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని ఏర్పా టు చేస్తున్నామన్నారు. ఆన్‌లైన్‌లోనూ నామినేషన్లను సమర్పించొచ్చని.. ఆన్‌లైన్‌లో చేశాక ఫిజికల్ కాపీని అందించాల్సి ఉంటుందని తెలిపారు.

ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కేసులు

జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎటువంటి సభలు, సమావేశాలు నిర్వహించాలన్నా ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా నోడల్ అధికారులను నియమించామని, ప్రతి నియోజకవర్గానికీ 9 చొప్పున ఫ్లయింగ్, స్టాటిక్ సర్వేలైన్స్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై వచ్చే ఫిర్యాదులను పరిష్కరించేందుకు జిల్లాలో ఎంసీసీ, వీడియో సర్వేలైన్స్ బృందాలు, ఎంసీఎంసీ కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. కోడ్ ఉల్లంఘనపై ప్రజలు నేరుగా 1950 టోల్ ఫ్రీనంబర్‌కు ఫిర్యాదు చేయొచ్చని.. దీంతోపాటు సీ-విజిల్ యాప్‌నూ ఈసీ అందుబాటులో ఉంచిందన్నారు.

ఎన్నికల నిర్వహణకు 16వేల సిబ్బంది

జిల్లాలో లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు 16 వేల సిబ్బంది అవసరమని కలెక్టర్ శశాంక తెలిపారు. 3,455 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల్లో అభ్యర్థులు రూ.95లక్షల వరకు ఖర్చు పెట్టుకునేందుకు ఈసీ అవకాశం ఇచ్చిందన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో 80 ఏండ్లకు పైబడిన వారికి ఇంటి నుంచే ఓటు వేసే అవకాశం ఉండేదని, ఈసారి ఎన్నికల్లో ఈసీ 85 ఏండ్లకు పైబడిన వారికే ఈ అవకాశం కల్పిస్తున్నదన్నారు. వృద్ధులతోపాటు దివ్యాంగులకు ఇంటి నుంచి ఓటు వేసే వెసులుబాటు ఉన్నదని, బీఎల్వోల ద్వారా సంబంధిత 12-డీ ఫారాలను అందజేయడం జరుగుతుందన్నారు. నామినేషన్ల స్వీకరణ గడువు ఏప్రిల్ 25 తేదీ వరకు కూడా కొత్త ఓటు నమోదుకు దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. ఈ సమావేశంలో వివిధ విభాగాల అధికారులున్నారు.

శిక్షణా తరగతుల్లో పాల్గొన్న సంబంధిత అధికారులు

భారీ చోరీ

- బొంగులూరులో తాళం వేసిన ఇంట్లో చొరబడి 16 తులాల బంగారం, 2 లక్షల నగదు ఎత్తుకెళ్లిన దొంగలు
- 11వ రోజు వేడుకకు వెళ్లి వచ్చేసరికి ఇంట్లో సొత్తు మాయం
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన క్లూస్‌టీం క్రైం డీసీపీ కరుణాకర్

ఆదిబట్ల, మార్చి 19 : ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో భారీ దొంగతనం జరిగింది. ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలిసి తమ బంధువుల ఇంటికి 11వ రోజు వేడుకకు వెళ్లి వచ్చేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లో ఉన్న బంగారం, నగదును దొంగలు ఎత్తుకెళ్లడంతో బాధితులు ఆదిబట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదిబట్ల సీఐ రఘువీర్ రెడ్డి కథనం ప్రకారం.. ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధి బొంగులూరు గేట్ సమీపంలోని రాఘవేంద్ర గృహాల వద్ద గంజి యాదగిరి తన కుటుంబసభ్యులతో ఇంటిని నిర్మించుకుని నివాసం ఉంటున్నారు. ఈ నెల 16న తన కుటుంబసభ్యులు భార్య, ముగ్గురు కుమారులు, ఇద్దరు కోడళ్లతో కలిసి నల్లగొండ జిల్లా పీఏ పల్లిలో తమ బంధువుల ఇంటిలో 11వ రోజు వేడుకకు ఇంటికి తాళం వేసి వెళ్లారు. వేడుకను ముగించుకుని యాదగిరి కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం 18న రాత్రి 8 గంటలకు బొంగులూరులోని తన ఇంటికి వచ్చాడు. మెయిన్‌డోర్ తాళం పగులగొట్టి ఉండడంతో లోపలికి వెళ్లి చూడగా గ్రౌండ్ ఫ్లోర్‌లోని ఒక అల్మారా, మొదటి అంతస్తులోని 2 అల్మారాలను పగులగొట్టి ఉన్నాయి. అందులో ఉన్న 16 తులాల బంగారు ఆభరణాలు, 2 లక్షల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించాడు. వెంటనే బాధితులు ఆదిబట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. క్లూస్ టీంతో పాటు క్రైం డీసీపీ కరుణాకర్ ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి, సీసీఎస్ సీఐ విజయ్, ఎస్ఐ వెంకటేశ్‌తో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. చోరీకి పాల్పడినవారి వేలిముద్రలను సేకరించారు. చుట్టుపక్కల ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. త్వరలో దొంగలను పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి తదితరులు

బాధితులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న పోలీసులు

గో సేవే.. మాధవ సేవ

- చాగంటి కోటేశ్వరరావు
- ఘనంగా గోశాల సేవా సమితి దశాబ్ది ఉత్సవాలు

తాండూరు, మార్చి 19 : సృష్టిలో గోమాత, భూమాత, స్త్రీమాత చాలా గొప్పవారని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు అన్నారు. మంగళవారం తాండూరులో ఘనంగా గోశాల సేవా సమితి దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన ప్రవచన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ధార్మిక ప్రవచనాలను అందించారు. అశేష భక్తజన సందోహం పాల్గొని కార్యక్రమం ఆసాంతం విని శ్రవణానందభరితులయ్యారు. పట్టణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నది. ఈ సందర్భంగా చాగంటి మాట్లాడుతూ.. హిందూ ధర్మం సనాతన ధర్మమన్నారు. గోవులను పూజిస్తే సకల దేవతలను పూజించినట్లేనన్నారు. ఎక్కడైతే గోవు ఉంటుందో ఆ ప్రదేశం పరమ పవిత్రంగా మారిపోతుందన్నారు. ప్రతి ఒక్కరూ స్త్రీలను గౌరవించాలని ఆయన సూచించారు.

కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

ధార్మిక ప్రసంగం చేస్తున్న చాగంటి కోటేశ్వరరావు

వైభవంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభం

పరిగి, మార్చి 19 : పరిగిలోని బాలాజీనగర్ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఉదయం గణపతి పూజ, విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, స్వామివారికి అభిషేకం, సాయంత్రం తులసి అర్చన, కుంకుమార్చన, సాయంత్రం ఎదుర్కోళ్లు తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ బ్రహ్మోత్సవాల్లో ఎంపీ రంజిత్‌రెడ్డి పాల్గొని స్వామివారికి పూజలు చేశారు. ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి-ఉమాదేవి దంపతులు పూజలు, హోమం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, మాజీ సర్పంచ్ సిద్దాంతి పార్థసారథి, మాజీ జడ్పీటీసీ బాబయ్య, కాంగ్రెస్ నాయకులు రఘుమోహన్‌రెడ్డి, లాల్‌కృష్ణప్రసాద్, శ్రీనివాస్, ఆనందం, కృష్ణ, చిన్న నర్సింహులు ఉన్నారు.

పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి-ఉమాదేవి దంపతులు

అన్నాస్‌పల్లి గ్రామంలోని ఎర్త్ సెంటర్‌ను సందర్శించిన హీరో సుమన్, శేషగిరిరావు

పుడమిని కాపాడుకోవాలి

- ప్రముఖ హీరో సుమన్
- అన్నాస్‌పల్లి గ్రామంలోని ఎర్త్ సెంటర్ సందర్శన

కడ్తాల్, మార్చి 19 : పుడమిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉన్నదని ప్రముఖ హీరో సుమన్ అన్నారు. మండల పరిధిలోని అన్నాస్‌పల్లి గ్రామ సమీపంలో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవెల్యూషన్ (సీజీఆర్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎర్త్ సెంటర్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. ఎర్త్ సెంటర్‌తోపాటు సీజీఆర్ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాల వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ.. భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ పర్యావరణంపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. కాలుష్యం పెరిగిపోవడంతో వాతావరణంలో అనేక మార్పులు చోటుచేసుకొని రుగ్మతలకు కారణమవుతున్నాయని పేర్కొన్నారు. ఆరోగ్యకరమైన వాతావరణంపైనే మానవాళి మనుగడ ఆధారపడి ఉన్నదని, వాతావరణంలో వస్తున్న అసాధారణ మార్పులను నిలువరించడానికి విరివిగా మొక్కలు నాటాలని ఆయన పిలుపునిచ్చారు. పర్యావరణాన్ని పరిరక్షించడానికి ఎర్త్ సెంటర్‌లో నిర్వహిస్తున్న కార్యక్రమాలు అభినందనీయమని తెలిపారు. ప్రకృతిని పరిరక్షించడానికి యువతకు శిక్షణా తరగతులు, చిన్నతనం నుంచే విద్యార్థులకు మొక్కలను పెంచడంపై అవగాహన కల్పించడం గొప్ప విషయమని సుమన్ పేర్కొన్నారు.

మొక్కలు నాటడం అభినందనీయం

ఫార్చ్యూన్ బట్టర్‌ఫ్లై సిటీ సీఎండీ శేషగిరి రావు మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు సీజీఆర్ సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలు ప్రశంసనీయమని తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లోని యువతను, విద్యార్థులను భాగస్వామ్యం చేస్తూ ఇప్పటివరకు 38 లక్షల మొక్కలు నాటడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. అనంతరం సీజీఆర్ వ్యవస్థాపకులు లీలమ్మ, లక్ష్మారెడ్డి సుమన్‌కు మొక్కతోపాటు 'ఎన్విరాన్‌మెంట్ ఔట్ లుక్' పుస్తకాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఫార్చ్యూన్ బట్టర్‌ఫ్లై సిటీ ఈడీ రమేశ్, వందే మాతరం ఫౌండేషన్ అధ్యక్షుడు రవీందర్, మాజీ సర్పంచ్ శంకర్, పర్యావరణ శాస్త్రవేత్త ఉమామహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

వికారాబాద్‌లోని ఓ పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు

సజావుగా పదో తరగతి పరీక్షలు

షాబాద్, మార్చి 19 : పదో తరగతి పరీక్షలు సజావుగా జరుగుతున్నాయి. మంగళవారం రంగారెడ్డిజిల్లాలో 50,810 మంది విద్యార్థులకు 50,652 మంది పరీక్షకు హాజరైనట్లు సంబంధిత విద్యాశాఖ అధికారులు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 239 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లాలో ప్రతి పరీక్షా కేంద్రానికి ఓ చీఫ్ సూపరింటెండెంట్, ఓ డిపార్ట్‌మెంట్ అధికారి, జిల్లా వ్యాప్తంగా 2,450 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. ప్రతి కేంద్రానికి ఓ సిట్టింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా 144 సెక్షన్‌ను విధించారు. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్ష జరిగే సమయంలో సెంటర్లకు సమీపంలో ఉన్న జిరాక్స్ కేంద్రాలను మూసివేయించారు. పరీక్షల్లో కాపీయింగ్‌కు పాల్పడకుండా పకడ్బందీగా చర్యలు తీసుకున్నారు.

వికారాబాద్, మార్చి 19 : వికారాబాద్ జిల్లాలో పదో తరగతి పరీక్షలు మంగళవారం సజావుగా జరిగాయి. 13,401 మంది విద్యార్థులకు 13,342 మంది పరీక్షలు రాసినట్లు విద్యాశాఖాధికారులు తెలిపారు.

మత్స్య పారిశ్రామిక సంఘం అధ్యక్షుడిగా నర్సింహ

నర్సింహకు నియామక పత్రాన్ని అందజేస్తున్న జిల్లా అధికారి సరస్వతి

మంచాల, మార్చి 19 : మంచాల మండలం ఆగపల్లి గ్రామంలో మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలు జిల్లా అధికారి సరస్వతి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో 37 మంది సభ్యులు పాల్గొనగా అందులో ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా బొద్రమోని నర్సింహ ఉపాధ్యక్షుడిగా ముక్కెర పరమేశ్, ప్రధాన కార్యదర్శిగా పూజారి పాపయ్య, డైరెక్టర్లుగా బుచ్చయ్య, బుట్టి ప్రభాకర్, నాగరాజు, బొద్రమోని జగన్, పిడుగు వెంకటేశ్, యాట దానయ్యతో పాటు సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ చీఫ్ ప్రమోటర్ నర్సింహ, జిల్లా డైరెక్టర్లు శంకర్, తలారి సతీష్, పూజారి బుచ్చయ్య, యాట రమేశ్, పిట్టల అశోక్ పాల్గొన్నారు.

కృష్ణ మృతదేహానికి సెల్యూట్ చేస్తున్న పోలీసు సిబ్బంది

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి

పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు

బషీరాబాద్, మార్చి 19 : రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కానిస్టేబుల్‌కు ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించినట్లు ఎస్సై రమేశ్ మంగళవారం తెలిపారు. అల్లాపూర్ గ్రామానికి చెందిన కృష్ణ వికారాబాద్ జిల్లా హెడ్‌క్వార్టర్స్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆదివారం రోడ్డు ప్రమాదానికి గురై కృష్ణ మృతిచెందాడని, మృతదేహాన్ని సొంత గ్రామమైన అల్లాపూర్‌కు తరలించి సోమవారం సాయంత్రం కుటుంబసభ్యుల సమక్షంలో పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో తాండూరు రూరల్ సీఐ అశోక్, వికారాబాద్ ఆర్ఐ డేవిడ్ విజయ్, వికారాబాద్ ఆర్ఎస్సై శివకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడి ఔదార్యం

ముస్లిం రైతుకు ఎద్దు బహూకరణ

మొయినాబాద్, మార్చి 19 : చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు సీఎస్ రంగరాజన్ ఉదార స్వభావాన్ని చూపారు. ఓ ముస్లిం రైతుకు ఎద్దును బహూకరించి మానవత్వాన్ని చాటారు. ఆపదలో ఉన్న రైతులను ఆదుకోవడంలో చిలుకూరు బాలాజీ ఆలయం ముందుంటుంది. అదే తరహాలో కులం, మతం అని చూడకుండా ఓ ముస్లిం రైతుకు ఎద్దును పంపిణీ చేశారు. ఈ నెల 15న చిలుకూరు గ్రామంలో మహ్మద్ గనీమియా(ఎండీ గౌస్) వ్యవసాయ బావి వద్ద విద్యుత్తు తీగ తెగి నేలపై పడింది. అదే సమయంలో అతడు పెంచుకుంటున్న ఎద్దు మేత మేసుకుంటూ వెళ్లి తీగకు తగిలి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకుడు సీఎస్ రంగరాజన్ రైతు కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చాడు. గోశాలలో సాకుతున్న ఓ ఎద్దును ఇస్తానని చెప్పి మంగళవారం అందించారు.

రైతుకు ఎద్దును బహూకరిస్తున్న చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకుడు రంగరాజన్